# ద్రౌపది

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



# ద్రౌపది

డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ప్రచురణ
లోక్‌నాయక్ ఫౌండేషన్
విశాఖపట్నం



# DRAUPADI

**By *Dr. Yarlagadda Laxmi Prasad***

*First Edition*
January 2006

*Second Edition*
January 2008

© Dr. Yarlagadda Laxmi Prasad

*Price*
Rs. 100 $ 10

*Type set*
AMS, Literacy House,
OU Road, Vidyanagar,
Hyderabad - 500 007.
Ph: 27096464, 27098406

*Printed at*
**Vipla Computer Services**
*(Designers & Multi Colour Offset Printers)*
Nallakunta, Hyderabad - 500 044.
Ph: 2767 6910, 2765 4003

*Book Production*
**T. Muralidhar Gowd**

*Published by*
**Loknayak Foundation**
Engineering College Staff Quarters
Andhra University
Vishakapatnam - 530003
Cell: 98490 67343

*Sole Distributors*
**Surya Prachuranalu**
Hyderabad - 500 035.
Ph: 040-24047889



ప్రజా వైద్యానికి సరైన భాష్యం చెప్పిన వైద్యులు,
విద్యా సాహిత్య సాంస్కృతిక, రాజకీయ రంగాలలో ప్రసిద్ధులు
డాక్టర్ కాసరనేని సదాశివరావు గారికి
నా ఆత్మీయతా పురస్కారం...

# విషయసూచిక


సంస్పందన -డా॥ సి.నారాయణరెడ్డి

ముందు మాట -జస్టిస్ చలమేశ్వర్

కొత్త కోణం ఆవిష్కారం -ఎస్.జైపాల్‌రెడ్డి

మనవి -డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

1. ఎవరి కోసం ఈ మహా సంగ్రామం? 1
2. అశత్థామకు క్షమాభిక్ష 13
3. రణభూమి - మరుభూమి 19
4. అగ్ని సంస్కారం 27
5. స్వయంవరం 30
6. కర్ణుడి అపూర్వ వ్యక్తిత్వం 41
7. కుంతీదేవి అభ్యర్థన 49
8. కృష్ణలీల 53
9. ధర్మ యోగి - కర్ణుడు 57
10. కర్ణుడు కుంతీపుత్రుడా? 62
11. ధర్మబోధన 65
12. ఫలించిన స్వప్నం 67
13. అంతరంగ మథనం 70
14. నేనెవరిని? 80
15. ఏది జీవన ధర్మం? 85
16. ద్రౌపది మీకు యజ్ఞవేదిక 90
17. అత్తవారింట్లో తొలిరోజు 98
18. ధర్మ నిర్ణయం 103
19. పాణిగ్రహణాలు - పంచరాత్రులు 109
20. ధర్మజుని ఆత్మన్యూనత 113
21. భీమసేనుని బిగి కౌగిలి 117
22. అర్జునుని సౌందర్యారాధన 120





23. నకుల, సహదేవుల సాంగత్యం 124
24. అత్తగారి అంతరంగం 126
25. పాండవులకు ధృతరాష్ట్రుని ఆహ్వానం 129
26. అగ్రజుని నిర్ణయం 131
27. అర్జునుని తీర్థయాత్ర 134
28. సంతానవతి 137
29. కృష్ణునికి ఇష్టసఖి 139
30. రాజసూయ యాగం 143
31. మయసభ 145
32. సహదేవుని సందేహ నివృత్తి 147
33. ద్యూతక్రీడ 150
34. వస్త్రాపహరణం 153
35. మరల ద్యూతక్రీడ 174
36. పాండవ వనవాసం 181
37. కృష్ణుని అభయం 186
38. ఎవరి కోసం ఈ మహా సంగ్రామం? 190
39. అర్జున వియోగం 195
40. భీమసేనుని రక్షణ 197
41. ద్రౌపది సౌందర్య రహస్యం - సత్యభామకు ఉపదేశం 201
42. అజ్ఞాతవాసం 207
43. సైరంధ్రి 213
44. కీచక వధ 218
45. శ్రీకృష్ణరాయబారం 227
46. కురుక్షేత్రం 229
47. జైత్రయాత్ర 232
48. రాజమాత నిష్క్రమణ 234
49. మహాప్రస్థానం 236
50. వేణుగానంలో లీనం 238

# సంస్పందన

ఇది మహాభారతంలోని ద్రౌపది పాత్ర చుట్టూ పరివేషించిన సన్నివేశాల కథనం మాత్రమే కాదు. కొంతవరకు కాకపోదు. అంటే ఈ గ్రంథంలో కొన్ని వ్యాసప్రోక్త మూలభారతంలోని కథాంశాలు, కొన్ని డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు వివిధ గ్రంథాల్లోంచి సమీకరించిన కథా సంబంధి విషయాలు, మరికొన్ని స్వయంగా కల్పించుకున్న సందర్భాలు సముచిత రీతిలో మేళవించుకున్నాయి.

నవల సృజనాత్మక సాహిత్య ప్రక్రియ. ఇలా జరిగింది అని వివరించేది ఇతిహాసం. లక్ష్మీప్రసాద్‌గారు అభిజ్ఞులు అందించిన ఐతిహాసిక పరిశోధనాంశాలను నేపథ్యంగా గ్రహించి ఈ "ద్రౌపది" నవలను అత్యంత సృజనాత్మక శైలిలో రూపొందించారు.

ఈ నవలలో లక్ష్మీప్రసాద్‌గారు చేపట్టిన కథన విధానం, వర్ణనల సంవిధానం పాఠకులను పరమతత్పరతతో చదివించేదిగా వున్నాయి. అక్కడక్కడ ఓ కుదుపు కుదిపి ఆలోచింప జేసేవిగానూ వున్నాయి. అలా కుదిపే ఘట్టాల్లో ద్రౌపది పతి పంచకంతో పంచరాత్రులు పొందిన విలక్షణానుభవాల వివరణ గమనించదగింది.

ఒకనాడు ప్రముఖ మరాఠీ రచయిత డా॥ ఖండేకర్ "యయాతి" నవలను ఆంగ్లానువాద రూపంలో నేను చదివినప్పటి ప్రగాఢమైన అనుభూతి డా॥ యార్లగడ్డ రచించిన ఈ "ద్రౌపది" నవలను చదువుతూ వుంటే ద్విగుణీకృతమైంది. తెలుగు పౌరాణిక నవలల్లో ప్రత్యేక స్థానం వహించగల ఈ రసవత్తర రచనను రూపొందించిన ఆత్మీయులు డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారికి నా అభినందన. ఇదే నా హార్దిక సంస్పందన.

***-డాక్టర్ సి.నారాయణరెడ్డి***



# ముందు మాట

ఈ 'ముందు మాట' పుస్తక ప్రచురణకు ముందు రాసిన మాట కాదు. 'ద్రౌపది' నవల యిప్పటికే 'ఆంధ్రజ్యోతి ఆదివారం' అనుబంధంలో ధారావాహికంగా ప్రచురింపబడి రచయితకు దూషణ, భూషణ తిరస్కారాదుల్ని, ప్రశంసల్ని సంపాదించిపెట్టినది.

ఈ నవలను మెచ్చిన వారికి, నచ్చనివారికి, నా ముందు మాట వలన ఇప్పుడు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు.

మహాభారత కథ, అందలి పాత్రలను గురించి అనేక భాషల్లో విమర్శలు వచ్చాయి. ఆ విమర్శలపై అనేక ఖండన మండనలు గతంలో జరిగాయి. జరుగుతూనే వుంటాయి.

సుమారు యాబది సంవత్సరములకు పూర్వం బ్రహ్మశ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసిన 'మహాభారత తత్త్వ కథనము' అన్న గ్రంథంలో అప్పటి వరకు వచ్చిన కొన్ని విమర్శలు, వాటి ఖండన మొదలైన చాలా వివరాలు దొరుకుతాయి.

'ద్రౌపది' నవలలోని సాహిత్యపు విలువల్ని సమీక్షించే పాండిత్యం నాకు లేదు.

'పురాణ పాత్రలను స్పృశించడం అసిధారావ్రతం అవుతుందని తెలిసి చేసిన రచన యిది' అని రచయితే స్వయంగా రాసాడు. కత్తిమీద సాము చేయడం సరదా - లక్ష్మీప్రసాద్‌కి, సాహిత్య విషయములలోనే కాదు యితరత్రా కూడా!

'ద్రౌపది' నవల రాయడానికి గల వుద్దేశ్యాన్ని ప్రసాద్ వివరిస్తూ...

"ప్రధానంగా గత రెండు జన్మలలో తీరని కామోపభోగేచ్ఛను, సంసార సుఖాన్ని తీర్చుకోవటానికే ద్రౌపది జన్మించిందని భారతంలో చెప్పబడినది. అయితే ఈ జన్మలో ద్రౌపదిగా, ఏ కోరికలు ఈడేర్చుకోవడానికి పరమశివుని వరప్రసాదంగా జన్మించినదో, ఆ కోరికలు ఈ జన్మలో తీరాయో లేదో అనే విషయం చర్చిస్తూ ద్రౌపది మహోన్నత వ్యక్తిత్వాన్ని, ప్రశంసనీయమైన ఆమె ఆత్మవిశ్వాసాన్ని, మహిళా లోకానికే మకుటాయమానంగా నిలిచిన ఆమె సౌశీల్యాన్ని, కుమార్తెగా, సోదరిగా, భార్యగా, తల్లిగా, శ్రీకృష్ణుని సఖిగా మహారాజ్ఞిగా, రాజనీతిజ్ఞురాలుగా, విదుషీమణిగా, ఉత్తమ యిల్లాలుగా, గృహిణిగా వివిధ రూపాలలో పరిఢవిల్లిన ఆమె వ్యక్తిత్వగరిమను వివరించటమే నాయీ నవలా రచనోద్దేశ్యం. ఈ సందర్భంలో చతుర్విధ ఫల పురుషార్థాలైన ధర్మార్థ కామ మోక్షములను, మహాకవి కాళిదాసు చెప్పిన:

‘కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతా, శయనేతు రంభా,
రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ, షట్కర్మయుక్తా కులధర్మపత్నీ’ లోని

కుల ధర్మపత్ని లక్షణములను కూడా పరిగణనలోనికి తీసుకుని సర్వలక్షణ సమన్వితగా ద్రౌపదిని ఈ నవలలో చూపటానికి ప్రయత్నించాను” అన్నాడు.

సర్వలక్షణ సమన్వితగా ద్రౌపదిని చూపించగలిగాడా? ఆ ప్రయత్నంలో ఎంతవరకు సఫలతను పొందాడు... అన్నది చదివేవారి వ్యక్తిగతమయిన అభిప్రాయం. నా వరకు నాకు చూపించగలిగాడనే అనిపించింది.

గత జన్మలలో తీరని కామోపభోగేచ్ఛను తీర్చుకోవడానికే ద్రౌపది జన్మకారణమనే అభిప్రాయానికి మూలం సంస్కృత భారతంలోనూ, నన్నయ భారతములోనూ కూడా వున్నదే. నాలాయని అనే పేరుతో గతజన్మలో మౌద్గల్య మహర్షి భార్యగా ద్రౌపది గతజన్మ వృత్తాంతం వివరించబడినది.

‘.... అది కామభోగంబులం దనయక కాలవశంబున శరీరంబు విడిచి కాశీరాజను రాజర్షికిం బుట్టి పెరుంగుచుం గన్యాత్వమునం బెద్దకాలంబుండి తన దౌర్భాగ్యంబునకు నిర్వేదించి పతింగోరి పశుపతి నుద్దేశించి యుగ్రతపంబు సేయుచున్నంత...’

ఆవిడ తపస్సుకి మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఆమెకు అయిదుగురు భర్తలు కలుగుదురు... అని వరమిచ్చినట్లు మహాభారతంలో చెప్పబడినది.

ఒక స్త్రీకి ఒకరికంటే ఎక్కువ మంది భర్తలుండే సమాజం మనకు తెలియదు. అటువంటి సంఘటన మహాభారత కథాకాలానికి కూడా అసాధారణమే. అయితే, అంతకు పూర్వము కూడా అటువంటి సంఘటనలు ఒకటీ రెండు జరిగినట్లు మహాభారతంలోనే చెప్పబడింది. సాక్షాత్తు ద్రౌపది వివాహంనాడే ద్రుపదుడికి ఈ అనుమానము వచ్చినది. ఇటువంటి వివాహము లోకవిరుద్ధమని, అధర్మమని, ద్రుపదుడే అనుమానపడ్డాడు. అయితే అటువంటి వివాహములు గతంలో కూడా జరిగినట్లు వ్యాసభారతములోనూ చెప్పబడినది.

‘శ్రూయతే హి పురాణేఽపి జటిలా నామగౌతమీ,
ఋషీ నధ్యాసితవతీ సప్త ధర్మభృతాం వరా
తథైవ మునిజా వార్క్షీ తపోభిర్భావితాత్మనః’

మన దృష్టిలో విచిత్రమయిన అటువంటి వివాహ వ్యవస్థలో స్త్రీ యొక్క మానసిక పరిస్థితి ఏమిటి అనేది - ఆమె చెబితేగాని యితరులకు తెలియదు - ఊహించవలసినదే. అటువంటి ఊహే లక్ష్మీప్రసాద్ ‘ద్రౌపది’ నవలలో కనిపిస్తుంది.

ఊహించడము అవసరమా అన్నది వేరే ప్రశ్న. ఆ విషయానికి తరువాత వద్దాము.

మహాభారతములోని ముఖ్య పాత్రలన్నీ అసాధారణమైన వ్యక్తిత్వం గల పాత్రలే, శ్రీకృష్ణుని విదురుని మినహాయిస్తే, యితర పాత్రలన్నీ మానవ సహజమైన రాగద్వేషాలకు



లోబడి నడుచుకున్నాయి. పాండవులుగానీ, ద్రౌపదిగానీ రాగద్వేషములకు అతీతులుగా చిత్రీకరించబడలేదు. వారు రాగద్వేషాలకు అతీతులైనచో యింత కథ జరిగివుండేది కాదు. ఆ రాగద్వేషాలు సహజంగానే స్త్రీ పురుష సంబంధాలలో తమవంతు పాత్రను పోషిస్తాయి.

ద్రౌపది ఒక మరబొమ్మకాదు. ప్రతీ సంవత్సరమూ గత జీవితపు అనుభవాన్ని పూర్తిగా మరచిపోయి, కొత్త అధ్యాయం ప్రారంభించినట్లు కనబడుటలేదు.

సాక్షాత్తూ తిక్కనగారి భాషలో...
‘...ఇమ్మగువ యింద్ర, తనయుదెసం బక్షపాతిని; దానఁ జేసి
సుకృతములు ఫలియింపమిం; జూవె దీని, కిట్టి దురవస్థ వాటిల్లె; నీద్యచరిత.’

అయితే యిదంతా ద్రౌపది జీవితములో ఒక భాగము మాత్రమే. భార్యగా భర్తల ఆజ్ఞానుసారం అష్టకష్టాలు పడింది. క్షత్రియకాంతగా తాననుభవించిన అవమానాలకు ప్రతీకారం జరిగేవరకు భర్తలను విశ్రమించనివ్వలేదు.

ఇన్ని కోణాలు ఈ నవలలో లక్ష్మీప్రసాద్ చూపించాడు. ఈ ప్రయత్నంలో భాగంగా అయిదుగురు భర్తలతో కాపురం చేసిన స్త్రీ యొక్క మానసిక పరిస్థితిని విశ్లేషిస్తూ, ఆమె ‘ప్రైవేట్’ జీవితంలోకి తొంగిచూశాడు. ‘రవిగాంచని చోట కవిగాంచున్’ అన్న కవి పలుకులు మన ముందున్నాయి కదా! జరిగిన రచ్చకంతటికి అదీ కారణం. అది తగునా, తగదా అనేది వారి వారి వ్యక్తిగత అభిప్రాయాలకి వదిలేస్తే...

ప్రసాద్ రాసిన ఈ ‘ద్రౌపది’ నవల ఒక క్రొత్త ప్రక్రియ. ఏ రచనైనా దానిలో వున్న సత్తాను బట్టి బ్రతుకుతుంది. మహాభారతం సత్తావున్న కథ కాబట్టి కనీసం అయిదువేల సంవత్సరాలుగా బ్రతుకుతున్నది. లక్ష్మీప్రసాద్ నవలలో ఎంత సత్తా వున్నదనేది కాలమే నిర్ణయిస్తుంది. ఏదో కొంప మునిగిపోయినట్లు కంగారు పడవలసిన అవసరం నాకేమీ కనబడుటలేదు.

ఆంధ్రజ్యోతి సంపాదకులు ఈ నవలను ప్రచురిస్తూ ‘ద్రౌపది హృదయాన్ని ఆవిష్కరించిన విశిష్ట నవల... కొత్త ఆలోచనలను పురిగొలిపే రచన... పంచమవేదానికి తాజా భాష్యం’ అని రాసారు. కొత్త ఆలోచలు, తాజా భాష్యాలు, సమాజంలో, సాహిత్యంలో ఎప్పుడూ స్వాగతించదగినవే. అయితే కాల పరీక్షకు ఈ ఆలోచనలు నిలిచినపుడే అవి సాఫల్యాన్ని పొందుతాయి. చూద్దాం!

మిత్రుడు లక్ష్మీప్రసాద్‌కు అభినందనలు.

**- జస్టిస్ చలమేశ్వర్**

# కొత్త కోణం ఆవిష్కారం

మహాభారతంలోని ద్రౌపది పాత్రను ఎన్నుకుని డా॥ లక్ష్మీప్రసాద్ చేసిన సృజనాత్మక రచన చూసి నాకు ఆనందాశ్చర్యాలు కలిగాయి. ఈ రచన నన్నెంతో ఆకట్టుకున్నది.

ఈ రచన వినూత్నమైనదని చెప్పడానికి పలు కారణాలున్నాయి. డా॥ లక్ష్మీప్రసాద్ ద్రౌపది పాత్రకు ఆధునికమైన స్త్రీవాదాన్ని అన్వయించారు. అందువల్ల ద్రౌపది కేవలం ఒక బాధిత స్త్రీ మాత్రమే కాక ఒక బలమైన పట్టుదల గల కథానాయిక అని అర్థం చేసుకోవడానికి వీలు కలిగింది.

ద్రౌపది అంతరాంతరాలలో ఆమె అర్జునుడిని గాఢంగా ప్రేమించిందన్న అభిప్రాయం ఒకటున్నది. రామాయణంలో సీత రాముడిని ప్రేమించిన మాదిరే ద్రౌపది అర్జునుడిని ప్రేమించింది. రాముడు సీతను స్వయంవరంలో గెలుచుకున్న మాదిరే ద్రౌపదిని అర్జునుడు స్వయంపరంలో గెలుచుకున్నందువల్ల ఈ అభిప్రాయానికి ఆస్కారం ఏర్పడింది. అయితే ద్రౌపదికి అర్జునుడి పట్ల గాఢమైన ప్రేమ ఉన్నప్పటికి పాండవులందరినీ ఆమె తన జీవిత భాగస్వాములుగా గ్రహించవలసి వచ్చింది. కేవలం ఫ్రాయిడ్ తరహాలో ఆలోచించే మానసిక విశ్లేషజ్ఞుడు మాత్రమే ఆమెలోని భిన్నమైన మనోభావాల గురించి, అంతస్సంఘర్షణ గురించి శాస్త్రీయమైన అంచనాకు రాగలడు. ఈ నేపథ్యంలోనే లక్ష్మీప్రసాద్ ద్రౌపది అంతరంగాన్ని విశ్లేషించిన తీరును అర్థం చేసుకోవల్సి వుంటుంది.

కౌరవుల దుష్కార్యాలకు ప్రధాన బాధితురాలైన ద్రౌపది తన మనసుకు ఏర్పడ్డ తీవ్రమైన గాయాన్ని ఒక అసామాన్యమైన పట్టుదలగా మార్చుకుని పగ తీర్చుకున్నట్లు కనపడుతుంది. పగతో రగిలిపోయే ఒక అసాధారణమైన సౌందర్యరాశిగా ఆమె పాండవులలో యుద్ధం చేయాలనే పట్టుదలకు ప్రధాన ప్రేరణగా నిలిచారు. నిజానికి మహాభారత యుద్ధానికి ప్రధాన కారకుడు కృష్ణభగవానుడని చాలామంది భావిస్తారు. కాని అంతకంటే బలంగా ద్రౌపదే యుద్ధానికి ప్రధాన కారకురాలని భావించడం సముచితంగా ఉంటుంది.

ద్రౌపది బలమైన పట్టుదలను, ఆమె తన లక్ష్యాలపై దృష్టి సారించిన తీరు గమనిస్తే అలాంటి పాత్ర భారతీయ ఇతిహాసంలోనే కాక ప్రపంచ ఇతిహాసంలో కూడా మనకు ఎక్కడా కనిపించదు. చారిత్రక, పౌరాణిక కథానాయికలందరికన్నా ద్రౌపది ఎన్నో రెట్లు



ఉన్నతమైన వ్యక్తిత్వం కల స్త్రీ. చరిత్రలోకి వెళితే బహుశా ఈజిప్టుకు చెందిన క్లియోపాత్రాతో ద్రౌపదిని పోల్చవచ్చు. క్లియోపాత్ర కూడా సీజర్, ఆంటోనీ వంటి ఉన్నత వ్యక్తులను ప్రభావితం చేసి ప్రపంచ చరిత్రలో ఒక కీలకమైన మలుపుకు కారణమయ్యారు. హెలెన్ సౌందర్యం కూడా మహాయుద్ధానికి దారితీసి ఉండవచ్చు కాని ఆమె ద్రౌపది లాగా క్రియాశీలకమైన పాత్ర నిర్వహించకుండా తెరవెనుక పాత్రధారిలా ఉండిపోయారు.

ప్రతి పురుషుడి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుందని సైద్ధాంతికంగా అందరూ అంగీకరించే విషయమే కాని మహాభారత యుద్ధంలో పాండవుల విజయానికి ద్రౌపది చురుకుగా ప్రోద్బలం అందిస్తూనే మరోవైపు అయిష్టంగానే యుద్ధంలో భాగస్వామి అయింది. స్త్రీల ఆధిపత్య పాత్రకు మేధో స్థాయిలో గుర్తింపు లభించినప్పటికీ మహాభారతంలో ద్రౌపది ఆధిపత్య పాత్ర మాత్రం అందరికీ స్పష్టంగా కనపడుతుంది.

సాపేక్షికంగా ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించి, ద్రౌపది మనో చిత్రాన్ని మన కళ్లముందుంచిన డా॥ లక్ష్మీప్రసాద్‌ను అభినందించవలసి ఉన్నది.

**-ఎస్.జైపాల్ రెడ్డి**

# మనవి

కేంద్ర సాహిత్య అకాడమి వారు 1991లో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విష్ణుసుఖారామ్ ఖండేకర్ మరాఠీలో రాసిన 'యయాతి' నవలను హిందీ ద్వారా తెలుగులోనికి అనువదించే పనిని నాకప్పగించారు. పాత్రల స్వీయానుభూతుల వ్యక్తీకరణ ద్వారా ఖండేకర్ ఆ నవలను నడిపించిన తీరు నన్ను అబ్బురపరచింది. మహాభారతంలో నేను ఎక్కువగా అభిమానించే ద్రౌపది పాత్రను ఈ శైలిలో నవలా రూపంలో మలిస్తే బాగుంటుందన్న ఆలోచన నా మనోవిహాయసంలో మెరుపులా మెరిసింది. ద్రౌపది పాత్ర పట్ల నాకు అత్యున్నతమైన గౌరవం, అంతులేని ఆరాధనా భావం వున్నాయి. పురాణ పాత్రలను స్పృశించటం అసిధారావ్రతం అవుతుందని నాకు తెలుసు. అందుకే 2003వ సంవత్సరం నుండి మహాభారతానికి సంబంధించిన చాలా గ్రంథాలు, ద్రౌపది పాత్ర ఆధారంగా వివిధ భాషలలో వచ్చిన సుమారు నూరుపైగా గ్రంథాలను సేకరించి, కూలంకషంగా చదివి, పరిశోధనాపరంగా విషయ సేకరణ చేసాను. ఈ సందర్భంగా నేను సేకరించిన విషయాలలోని కొన్ని భాగాలను సంవత్సరం పాటు భారతం పట్ల పూర్తి అవగాహన వున్న పెద్దలకు, పెద్దగా అవగాహన లేకుండా కేవలం నాటకాలు, సినిమాల ద్వారా భారత కథలు తెలిసిన వివిధ స్థాయిలకు చెందిన మిత్రులకు చదివి వినిపించాను. చాలామంది ఇవన్నీ నిజమేనన్నారు. కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేసారు. కొంత మంది నా పరిశోధనను మెచ్చుకున్నారు. కొంత మంది భయపడ్డారు. భయపెట్టారు. అయితే ఐతిహాసిక పాత్రలకు దైవత్వాన్ని ఆపాదించి, ఆ పాత్రలను జన సామాన్యానికి దూరంగా కొండ మీద కూర్చోపెట్టి, ఆ పాత్రలకు అన్యాయం చేయకుండా ఆ పాత్రలలోని గుణదోష విశేషాల బేరీజు పట్టికతో, ఆ పాత్రలలోని మానవ సహజమైన రాగద్వేషాలతో పాటు, మహోన్నతమైన విశిష్ట లక్షణాలను వెలికితీసి ఆ పాత్రలకు న్యాయం చేయాలన్న సంకల్పంతోనే 'ద్రౌపది' నవలా రచనకు శ్రీకారం చుట్టాను. నవల పూర్తయిన తర్వాత విశాఖపట్నం, రాజమండ్రి, గుడివాడ, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, ఢిల్లీ నగరాలలో సమావేశాలు ఏర్పాటుచేసి కొన్ని ఘట్టాలు చదివి వినిపించాను. 49 అధ్యాయాలుగా సాగిన ఈ నవలలోని అంశాలకు సంబంధించిన ఆధార గ్రంథాలను ప్రదర్శనగా పెట్టాను. ఏ అధ్యాయానికి ఏ గ్రంథంలో ఆధారాలున్నాయో అందరికీ తెలిపాను. నవలా రచయితగా నాకున్న కొద్దిపాటి స్వేచ్ఛను కూడా, ఎలా ఎక్కడ వాడుకున్నానో తెలిపాను.



ద్రౌపది పాత్రను కొత్త కోణంలో దర్శింపజేసిన తీరుకు ఆశ్చర్యంతో కూడిన అభినందనలు తెలియచేసారు - జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, పద్మభూషణ్ డా॥ సి.నారాయణరెడ్డి, నా మిత్రులు ప్రఖ్యాత రచయిత, విఖ్యాత మనస్తత్వ విశ్లేషకులు సి.నరసింహారావు, సుప్రసిద్ధ కవి, విమర్శకులు ఆచార్య చందు సుబ్బారావు గారలు.

ఈ నవల ధారావాహికంగా ఏదైనా ప్రసిద్ధ పత్రికలో ప్రచురిస్తే బాగుంటుందనే ఆలోచనతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సంపాదకులు శ్రీ కొండుభట్ల శ్రీ రామచంద్రమూర్తి గారికి ఇచ్చాను. ఆదివారం అనుబంధంలో ప్రచురించటానికి వారు అంగీకరించారు. వారం వారం ప్రచురణ సాగుతున్న రోజులలో ఖండనలు, మండనలు చాలా తీవ్రంగానే వచ్చాయి. రెండూ నాకు సంతృప్తిని, సంతోషాన్ని కలిగించాయి.

శ్రీరాముడు దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు జన్మించాడని చెప్పి ఆ జన్మకు ఫలప్రాప్తిని రామాయణంలో వివరించారు. ధర్మసంస్థాపన కోసం శ్రీకృష్ణుడు జన్మించాడని చెప్పి ఆ జన్మకు ఫలప్రాప్తిని భాగవతంలో, భారతంలో వివరించారు.

ఆదిపర్వములోని పంచేంద్రోపాఖ్యానములో ద్రౌపది జనన రహస్యాన్ని వ్యాసుడు ద్రుపద మహారాజుకు ఈ విధంగా వివరించాడు- "ద్రౌపది పూర్వజన్మలో నాలాయనిగా, మౌద్గల్య మహర్షి భార్యగా తన సేవా శుశ్రూషలతో కుష్టువ్యాధిగ్రస్తుడైన భర్తను భక్తి శ్రద్ధలతో సేవించినదని, అందుకు మెచ్చుకున్న భర్త మౌద్గల్యముని భార్యను ఒక వరమిచ్చెద కోరుకోమనగా నాలాయని - 'మునీంద్రా! నాకు కామోపభోగములందు మిక్కిలి యిచ్ఛకలదు. కనుక, నీవు నీ తపశ్శక్తి చేత కామరూపము ధరించి, మిక్కిలి అసహ్యకరమైన యీ కుష్టు రూపమును విడిచి మనోహరమైన ఆకారముతో ఐదు విధములైన విడివిడి శరీరములను ధరించి, నాతో రమించి, కామోపభోగము లందు నన్ను తృప్తిపరపుము' అని కోరింది.

ఆ మాటలు విని ఆ మహాముని ఆమెకు ఇష్టమైన విధముగా ఐదు దేహములను ధరించి మర్త్యలోకమునందు, దేవలోకమునందున్ను సంచరించుచు బ్రహ్మఋషులచేత, దేవ ఋషుల చేతను పూజింపబడెను.

అట్లు అతను ఆ సుందర శరీరములతో సూర్యరథము నెక్కి పోయి ఆకాశగంగా జలములందు స్నానము చేసి, చంద్రకిరణములయందు నివసించి, మేరు పర్వతమునందు, కైలాస పర్వతమునందున్ను యథేచ్ఛగా ఆమెతో క్రీడించెను.

ఈ విధముగా మౌద్గల్య మహాముని అనేక సహస్ర సంవత్సరములు ఇంద్రసేనతో ఉపభోగించి తృప్తిచెందెను.

'తరువాత ఆ మహాముని ఆమెను విడిచిపెట్టి ఘోరమైన తపస్సు చేసి, బ్రహ్మమయుడై, బ్రహ్మలోకమునకు పోయెను.

'తరువాత ఇంద్రసేన కామోపభోగములందు తృప్తిదీరక అసంతృప్తితోనే కొంత కాలమునకు మరణించి కాశీరాజు అను రాజర్షికి బిడ్డగా పుట్టెను.

'ద్రుపదరాజా! తండ్రి యింటిలో ఆమె పెరుగుచు కన్యగానే చాలాకాలము ఉండి, తన దౌర్భాగ్యమునకు దుఃఖించుచు, పతిని గోరి పరమశివునుద్దేశించి ఉగ్రముగా తపస్సు చేయుచుండెను.

'అట్లు తపస్సు చేయుచున్న కాశీరాజపుత్రి కడకు యమ-వాయు-ఇంద్ర-అశ్వినీ దేవతలు ఆయెయెడల ప్రీతితో వేరువేరుగా వచ్చి తమ తమ దేహాంశముల నుండి ఆమె పునర్జన్మయందు ఆమెను భార్యగా కోరిరి.

'ఆమె గూడా కొంత కాలము జలము, వాయువు మాత్రము ఆహారముగా తీసికొని, కొంత కాలము నిరాహారముగా, కొంత కాలము ఒంటి కాలుమీద నిలిచి, మరికొంత కాలము పంచాగ్ని (నాలుగు వైపుల అగ్నులు, తలపైన సూర్యుడు) మధ్యమునందుండియు మిక్కిలి ఘోరమైన తపస్సు చేసెను. తరువాత పరమేశ్వరుడు ప్రసన్నుడై ఆమెకడకు వచ్చి వరము వేడుకొమ్మనెను.

అప్పుడా కన్యక 'నాకు పతిదానము చేయుము' అని మిక్కిలి ఆశతో ఐదుమారులు ఆ మాటనే అడుగుచు వేడుకొనెను.

అప్పుడు పరమేశ్వరుడు ఆమె యెడల కరుణించి 'పుత్రీ! నీకు తరువాత జన్మమునందు ఐదుగురు పతులు అయ్యెదరు' అని వరము ప్రసాదించి దీవించెను.

అప్పుడు కాశీరాజపుత్రి పరమేశ్వరునితో నిట్లనెను... 'భగవాన్! సతికి ఒక్కడే పతి యుండును. కాని, ప్రపంచమందెచ్చటనయినను ఒక సతికి అనేకులు పతులు ఉండుట వినియున్నామా? లోకేశ్వరా! లోకవిరుద్ధమైన యిట్టి వరము నాకు ఇష్టము లేదు.'

ఆ మాటకు ఆమెతో ఆ భగవానుడిట్లనెను: 'బిడ్డా! నా మాటచేత పునర్జన్మమునందు నీకు అయిదుగురు పతులుండెదరు. అయినను నీ పాతివ్రత్య ధర్మము చెడదు. కనుక, నీ యందు దయతో నీకు ఈ వరమిచ్చితిని.'

ద్రుపదరాజా! అట్లు పరమేశ్వరుడు చెప్పిన మాటలు విని, కాశీరాజపుత్రి మరల అతనిని ఈ విధముగా కోరెను:

'మహానుభావా! ఒకవేళ నాకు నీ వరప్రభావము వలన ఉత్తర జన్మమునందు అయిదుగురు పతులుండిన యెడల ఆ అయిదుగురితో సంగమము చేయునపుడు నాకు కౌమార వయస్సు (యౌవనావస్థ), పతిశుశ్రూష, కామభోగేచ్ఛ, సౌభాగ్యము ఇవి యన్నియు వేరువేరుగా నాకు అనుగ్రహింపవలెను.'

ఆమె కోరిన విధముగా పరమేశ్వరుడు ఆమెకు వరములిచ్చాడు.

*(ఈ కథ గోరఖ్‌పూర్ ప్రతి సంస్కృత మహాభారతములో లేదు. కాని క్రీ.శ. 1828లో ముద్రితమైన 'నిర్ణయసాగర్' ప్రతిలో నీ కథ యున్నది. ఇది నన్నయభట్టారకుని తెలుగు భారతము నుండి తీసికొని యిక్కడ వ్రాయబడినది.)*



ప్రధానంగా గత రెండు జన్మలలో తీరని కామోపభోగేచ్ఛను, సంసార సుఖాన్ని తీర్చుకోవటానికే ద్రౌపది జన్మించిందని చెప్పబడింది. అయితే ఈ జన్మలో ద్రౌపదిగా, ఏ కోరికలు ఈడేర్చు కోవటానికి పరమశివుని వరప్రసాదంగా జన్మించిందో, ఆ కోరికలు తీరాయా లేదా అన్న విషయం చర్చిస్తూ, ద్రౌపది మహోన్నత వ్యక్తిత్వాన్ని, ప్రశంసనీయమైన ఆమె ఆత్మవిశ్వాసాన్ని, మహిళా లోకానికే మకుటాయమానంగా నిల్చిన ఆమె సౌశీల్యాన్ని, కుమార్తెగా, సోదరిగా, భార్యగా, తల్లిగా, శ్రీకృష్ణుని సఖిగా, మహారాజ్ఞిగా, రాజనీతిజ్ఞురాలుగా, విదుషీమణిగా ఉత్తమ ఇల్లాలుగా, గృహిణిగా వివిధ రూపాలలో పరిఢవిల్లిన ఆమె వ్యక్తిత్వ గరిమను వివరించటమే నాయీ నవలా రచనోద్దేశ్యం. ఈ సందర్భంలో చతుర్విధ ఫలపురుషార్థాలైన ధర్మార్థకామ మోక్షాలను, మహాకవి కాళిదాసు చెప్పిన 'కార్యేషు దాసి, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా, రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ - షట్కర్మయుక్తా కులధర్మపత్నీ'లోని కులధర్మపత్ని లక్షణాలను కూడా పరిగణనలోనికి తీసుకుని సర్వలక్షణ సమన్వితగా ద్రౌపదిని ఈ నవలలో చూపటానికి ప్రయత్నించాను.

ఈ నవలా రచనలో నాకు వివిధ దశలలో - విషయ సేకరణలో, వివిధ పట్టణాలలో గోష్ఠుల నిర్వహణలో, నాకు సహకరించిన, సలహాలనిచ్చిన, మిత్రులు శ్రీ సి. నరసింహారావు గారికి, ఆచార్య చందు సుబ్బారావు గారికి, శ్రీ అప్పరసు కృష్ణారావు (ఢిల్లీ), శ్రీ మాశర్మ (విశాఖపట్నం), డా॥ గన్ని భాస్కరరావు (రాజమండ్రి), శ్రీ టి.డి.ప్రసాద్ (గుడివాడ), శ్రీ టి.వి.విజయకుమార్ (ఢిల్లీ), డా॥ యం.మోహన్‌బాబు, శ్రీ తుమ్మల గోపాలరావు (తిరుపతి), శ్రీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు (కె.రఘు), స్వర్గీయ ముమ్మనేని సుబ్బారావు (విజయవాడ), శ్రీ మలినేని నారాయణ ప్రసాద్ (విజయవాడ), శ్రీ రసరాజు (తణుకు) గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, సంపాదకులు శ్రీ కె. శ్రీరామచంద్రమూర్తి, శ్రీమతి వసంతలక్ష్మిగార్లకు ప్రత్యేక ధన్యవాదాలు.

తమ అమూల్యమైన అభిప్రాయాలను రాసి పంపిన పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి గారికి, కేంద్ర మంత్రివర్యులు, ఉత్తమ పార్లమెంటేరియన్, విశిష్ట రాజనీతిజ్ఞులు, శ్రీ యస్. జైపాల్‌రెడ్డి గారికి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, సాహిత్యాభిమాని, రసహృదయులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌గారికి గౌరవాభివందనాలు.

నా రచనా వ్యసనాన్ని నిరంతరం ప్రోత్సహించే ఆత్మీయ మిత్రులు విజ్ఞాన్ విద్యా సంస్థల అధిపతి డా॥ లావు రత్తయ్య గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

విశాఖపట్నం — డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
విజయదశమి

# 1
# ఎవరి కోసం ఈ మహా సంగ్రామం?

**తూ**ర్పు నుంచి ప్రసరిస్తున్న తొలి కిరణం ఆమె నెన్నడుమును తాకేందుకు ఉబలాటపడుతున్నది. వెలుగురేఖలు ఆమెను కౌగిలించుకుని వెచ్చదనాన్ని అనుభవించేందుకు ఆతురత పడుతున్నాయి. సూర్యుడి వేగానికి బెదిరిపోతున్న నిశాదేవి ఆమె వెన్నుపై పరచుకున్న తుమ్మెద రెక్కల్లాంటి శిరోజాలలో చిక్కుకున్నట్లు కనిపిస్తున్నది. నల్లకలువల అందమంతా పోతపోసినట్లు కనపడుతున్న ఆ లావణ్యరాశి సామాన్యమైన స్త్రీ కాదని ఆమెను చూసి నిశ్చేష్టురాలై స్తంభించిన ప్రకృతికి కూడా అర్థమయినట్లుంది. అనిర్వచనీయమైన ఆ అపురూప లావణ్యరాశి ద్రౌపది వల్ల కలిగిన మోహమే విశ్వేతిహాసంలో మున్నెన్నడూ జరగని మారణహోమానికి కారణం కావడంలో ఆశ్చర్యం లేదని ఆమె శరీరం నుంచి వెలువడే శరత్కాలంలోని తామరపువ్వుల పరిమళాన్ని ఆఘ్రాణించిన వారెవ్వరికైనా అనిపిస్తుంది.

పూర్తిగా తెల్లవారనే లేదు. కాని విరాట సామ్రాజ్యంలోని మత్స్యనగరి - ఉపప్లావ్యంలో... ఎక్కడ చూసినా తెల్లచీరలు కట్టుకున్న స్త్రీలు విషణ్ణ వదనాలతో తిరుగులాడుతున్న దృశ్యాలు ద్రుపద రాజపుత్రి మనస్సులో కదలాడుతున్నాయి. వెనక్కి తిరిగి చూస్తే తెల్లచీర కట్టుకున్న దాసి ఆమె ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ కనిపించింది. రాజప్రాసాదం నుంచి చూస్తే దూరం నుంచి దట్టమైన తెల్లటి పొగలు అప్పుడే మబ్బుల నుంచి బయటకు వస్తున్న సూర్యుడిని చుట్టుముట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి.

తెలుపు... ఈ తెల్లదనాన్నా నేను కోరుకున్నది... తెలుపు శోభనానికి, శాంతి సౌఖ్యాలకు; నలుపు, విషాదానికి సంకేతం అంటారు. కాని ఆ రోజు తెలుపు నన్ను విషాదంలా ఆవరిస్తున్నది... ఎన్నాళ్ళుగానో ముడివీడి విరబోసుకున్న ఈ నల్లటి కేశాలను ముడుచుకుని తెల్లటి మల్లెపూలు తురుముకోవాలని, శోభన చిహ్నమైన తెల్లటి చీర ధరించి ధవళ కాంతుల్లో మెరిసిపోతూ నా అయిదుగురు ప్రియులను అలరింప చేయాలని, కష్టాలు, కక్షలు, కార్పణ్యాల మరుగున సుఖాన్ని మరచిన ఈ దేహాన్ని వారి బిగి కౌగిళ్ళలో పరవశింప చేయాలిన ఎంత ఉబలాటపడ్డాను... కాని ఈ తెలుపురంగే ఇప్పుడు దుర్భరంగా మారింది.



తెల్లవారుతున్న ఈ ఉదయం రాత్రి ఎంత విషాదంగా గడిచిందో చెబుతున్నట్లు ఉంది. సూర్యుడి కళ్ళు ఎర్రబడ్డట్లుగా ఉన్నాయి. ఎవరో శోకిస్తున్నట్టు దూరం నుంచి వినిపిస్తున్న స్వరం తెలుపుతున్నది. మళ్ళీ ఏ క్షతగాత్రుడు మరణించాడో... ఉదయాన్నే పొయ్యి వెలుగుతున్నట్లు ఇళ్ళముందు నెగళ్ళు వెలుగుతున్నాయి, విరాటపుర వీధుల వెంట వెళుతుంటే శ్మశానం మధ్య నుంచి వెడుతున్నట్లు అనిపిస్తున్నది... నగరం నగరమంతా శ్మశానమే... శ్మశానం నుంచి శ్మశానానికి పయనం... ఇక్కడే ఇలా ఉంటే హస్తినాపురిలో ఎలా ఉన్నదో కదా... గాంధారీదేవి నూరుగురు పుత్రుల భార్యల వేదన ఏ స్థాయిలో ఉన్నదో... హస్తినాపురిలో ధర్మరాజు పట్టాభిషేకం రోజునైనా మంగళ వాయిద్యాల ఘోషలో వారి శోకం వినిపించకుండా ఉంటుందా...

గుండెలను పిండివేస్తున్నట్లు వినిపిస్తున్న రోదన... ఆ స్త్రీ తనలాగా ఎవరిని కోల్పోయిందో కదా... నా అయిదుగురు కొడుకులేరీ... అవును వారెక్కడికి వెళ్ళిపోయారు... నన్ను అమితంగా ప్రేమించిన తండ్రి ద్రుపదుడు, సోదరుడు ధృష్టద్యుమ్నుడు ఏరీ... అప్పుడే ఇంకిపోతున్న ఆమె కన్నీరు మళ్ళీ ధారలుగా ప్రవహించింది. ఉవ్వెత్తున శోక తరంగం గుండె లోతుల్లోంచి ఉబికి వచ్చింది. వేగంగా మంచం మీదికి తిరిగి వచ్చి ఆమె వెక్కి వెక్కి దుఃఖించసాగింది.

నిజంగా తాను యుద్ధాన్ని కోరి తప్పు చేసిందా... ద్రౌపదిని ఈ ప్రశ్న నిన్నటి ఉదయం నుంచే తొలిచి వేస్తున్నది. కడుపుకోత అంటే ఏమిటో ఆమెకు నిన్న ఉదయం శిబిరంలో నిద్రావస్థలో సంహరించబడిన తన పుత్రుల, సోదరుడి మృత దేహాల్ని చూసి తెలిసి వచ్చింది. అమ్మా! అన్న పిలుపుకు తానిక నోచుకోనా... అభిమన్యుడు మరణించినప్పుడు దుఃఖిస్తూ తనను సుభద్ర చూసిన చూపే తన గుండెను ఇంకా కోస్తున్నది... ఆ రోజు తాను ఎంత క్షోభ అనుభవించింది... కాని ఈ క్షోభ ఇప్పుడు మరింత తీవ్రంగా ఉన్నది... సుభద్ర బాధ తనకు ఇప్పుడు తెలిసి వస్తున్నది... నా కంటే ఎంతో ముందు కన్నది సుభద్ర అభిమన్యుణ్ణి. ఇంద్రప్రస్థంలో వాడి చిన్ననాటి శౌర్యసాహసాలు చూసి అందరూ మురిసిపోతుంటే తానెంతగా పుత్రులకోసం తపించింది... వరుసగా అయిదు సంవత్సరాలలో అయిదుగురికి జన్మనిచ్చాను. కాని అభిమన్యుడూ లేడు... అయిదుగురు పుత్రులూ లేరు. ద్రౌపది మనసు వారి ఆలోచనలతో నిండిపోయింది.

వింధ్య పర్వతంలాగా దృఢంగా ఉంటాడని ధర్మజుడి ద్వారా కలిగిన కుమారునికి బ్రాహ్మణులు ప్రతివింధ్యుడని పేరు పెట్టారు. భీముడు సోమయాగాలు చేసిన తర్వాత అతని ద్వారా పుట్టిన వాడికి శ్రుతసోముడని నామకరణం చేశాము. ఇంద్రప్రస్థంలోని ఉదయేందుపురంలో సోమలతల మధ్య జన్మించిన శ్రుతసోముడిని చూస్తేనే వేయి వెన్నెలల ప్రకాశాన్ని చూసినట్లుండేది. అర్జునుడు మహాకార్యాలు చేసి వచ్చిన తర్వాత కన్న కొడుకుకు శ్రుతకీర్తి అని పేరు పెట్టుకున్నాము. కౌరవ కులంలో ప్రఖ్యాతి గాంచిన

రాజర్షి శతానీకుడి పేరు నకులుని ద్వారా పుట్టిన కుమారుడికి పెట్టుకున్నాం. కృత్తికా నక్షత్రంలో పుట్టిన సహదేవుడి కుమారుడికి అగ్నిదేవుడికి మరో పేరైన శ్రుతసేనుడి పేరు పెట్టుకున్నాం... అని తలచుకుంటూ కుమిలి కుమిలి దుఃఖించింది ద్రౌపది.

విరాట భూపతిని కోల్పోయిన సుధేష్ణను, అభిమన్యుడిని కోల్పోయిన ఉత్తరను ఓదార్చేందుకే నిన్నటి వరకూ సరిపోయింది. ఇప్పుడు తనను ఓదార్చడం వారి వంతు అయింది. తనకూ పుత్రశోకం. తండ్రీ లేడు... సోదరుడూ లేడు... పుత్రులూ లేరు తనకు...

శ్మశాన ప్రశాంతి నిండిన విరాటనగరి ఉపప్లావ్యాన్ని చూస్తుంటే ద్రౌపది కడుపు తరుక్కుపోతున్నది. ఈ నగరంలోనే తాను కొద్ది రోజుల క్రితం వరకూ దాసిగా ఉన్నానన్న విషయం ఆమెకు నమ్మశక్యం కావడం లేదు. ఇక్కడే ఆ దుష్ట కీచకుడిచేత అవమానం పొందిన విషయం కూడా ఇప్పుడు స్మృతిలాగా మెదలుతున్నది. తనను ఇప్పుడు పాండవ పత్నిగా, ఒక మహాసామ్రాజ్యపు పట్టమహిషిగా గౌరవిస్తూ అడుగులకు మడుగు లొత్తుతున్నారు. అయితే ఉపప్లావ్యం నిండా సన్నిహిత బంధువుల, మిత్రుల భార్యలు దుఃఖిత వదనులై తమ పతులు జీవించి ఉన్నప్పుడు అనుభవించిన జీవిత ఘట్టాలను తలచుకుంటూ ఉంటే, తానొక్కతే జరగబోయే పట్టాభిషేక దృశ్యాలను ఊహించుకుంటూ కలలు కంటున్నది... ఇక ఇక్కడ ఎక్కువ రోజులు ఉండనవసరం లేదు.

నేను అయిదుగురు పుత్రులనే కోల్పోయాను... నూరుగురు పుత్రులను కోల్పోయిన గాంధారి పుత్రశోకం?... అయితే ఈ యుద్ధాన్ని ఎవరు ఆహ్వానించారు... కోరి మృత్యువును ఎవరు వరించారు...

పశ్చాత్తాపమా... తొడలు విరిగి మృత్యువును కౌగిలించుకుంటూ దుర్యోధనుడు మేమెప్పుడూ పశ్చాత్తాపపడుతూ జీవించాలని శపించాడట... అతడు శపిస్తున్నప్పుడు అతడి మీద పూలవానలు కురిశాయట... దివ్యదుందుభులు మ్రోగాయట. మందమారుతం సుగంధ భరితమై వీచిందట... అలా ఎందుకు జరిగిందో... ఆ యుద్ధానికి నేనే కారణమైనందుకు ఇప్పుడు పశ్చాత్తాపం నన్ను ముంచి వేస్తున్నదా... లేక నా పుత్రశోకమే నన్నిలాంటి వేదనకు గురి చేస్తున్నదా...

నేనెందుకు పశ్చాత్తాపపడాలి... భీష్మునీ, ద్రోణునీ, కర్ణునీ, భూరిశ్రవుణ్ణీ, తననూ న్యాయ యుద్ధంలో జయించలేదని దుర్యోధనుడు వాసుదేవుడిని అడిగిన మాట నిజమే కావచ్చు. కాని ఈ వివేకం కపట ద్యూతంలో మా సంపదలను హరించినప్పుడు ఏమయింది... కామంతో నా ఎత్తయిన వక్షస్థలాన్ని చూస్తూ వస్త్రాపహరణానికి తమ్ముడిని ప్రేరేపించినప్పుడు, నన్ను కూర్చోమని తన తొడ చూపించి సైగ చేసినప్పుడు ఏమైంది ఆ వివేకం... శ్రీకృష్ణుడు ఈ ప్రశ్నలు బాగానే అడిగాడు... కాని ఇవే ప్రశ్నలను నా భర్తలలో ఎవరైనా అడిగి ఉంటే ఇంకా బాగుండేది...



కాని జరిగిందేమిటి... యుద్ధం ఇంత భయంకరంగా ఉంటుందని తాను ఊహించిందా... నెత్తురు ఏరులై ప్రవహిస్తుందని, నగరాలు శ్మశానాలవుతాయని, చుట్టూ తెల్లటి వస్త్రాలతో చలత్‌ప్రేతాలు తిరుగుతుంటాయని తనకు ఆలోచన ఎప్పుడైనా వచ్చిందా... ఎవరు మిగిలారు యుద్ధంలో... ఎవరిపై తాము సామ్రాజ్యం ఏలాలి... ఆ సామ్రాజ్యాన్ని వారసత్వంగా అందించేందుకు తమకు ఒక్క పుత్రుడు కూడా మిగలలేదు కదా... మళ్ళీ ద్రౌపదికి ఉప్పెనలా దుఃఖం ముంచుకు వచ్చింది.

సంశప్తకులందరూ హతులయ్యారు... కాంభోజ సైన్యాలన్నీ కడతేరాయి... యవన, పార్వతీయ, మ్లేచ్ఛ బలాలు మట్టిపాలయ్యాయి. శల్యుడు లేడు... ఆ దుష్టబుద్ధి శకునీ నశించాడు. ఉలూకుడు ప్రాణాలు విడిచాడు. దుర్యోధనుని తమ్ములందరినీ భీమసేనుడు వధించాడు... కర్ణపుత్రులూ కరువయ్యారు. తొడలు విరిగి దుమ్ములో కలిసిపోయ పడి ఉన్నాడు దుర్యోధనుడు... పాండవ పక్షంలో ధృష్టద్యుమ్నుడూ, శిఖండీ, యుధామన్యుడు... పాంచాల వీరులు, మత్స్యరాజ బంధువులు, వారి చతురంగ బలాలను కౌరవులు తుదముట్టించారు. కౌరవ పక్షంలో కృప, కృతవర్మ, అశ్వత్థామలు, పాండవ పక్షంలో నా భర్తలు ఐదుగురు, కృష్ణ, సాత్యకులు, యుయుత్సుడూ... మిగిలింది ఇక వీరేనా... దుర్యోధనుడికే సామ్రాజ్యం వుంచాలని పదకొండు అక్షౌహిణులూ, అతడిని సంహరించాలని ఏడు అక్షౌహిణులూ యుద్ధంలో నేలకూలాయి... కౌరవ స్కంధావారమూ, పాండవ స్కంధావారమూ పురుష హీనాలైనాయి... మిగిలిన వారు స్త్రీలే... ఈ స్త్రీల సామ్రాజ్యాన్నా ఏలవలసింది.

ప్రశ్నల పరంపర ద్రౌపది దుఃఖాన్ని అధిగమించింది. ఆలోచనలు ఆమె ఆవేదనను చుట్టుముట్టాయి. కళ్ళలోంచి నీరు ఎప్పుడు ప్రవహిస్తున్నదో... ఎప్పుడు ఇంకిపోతున్నదో ఆమెకే తెలియదు... ఏరి... తన భర్తలేరీ... ఈ దుఃఖ సమయంలో తనను వారు ఒంటరిగా ఎందుకు వదలి వెళ్ళారు. వారిని చూస్తే కాని తన మనసు శాంతించలేదేమో... మళ్ళీ నిన్నటి సంఘటనలు ఆమె మదిలో మెదులుతున్నాయి.

రెండు రోజుల క్రితం రాత్రి వరకూ... ఆర్తనాదాలు, ఆక్రందనలు, ఏడుపులూ మనసును కదిపివేస్తున్నా... యుద్ధభూమిలో శవాల గుట్టలు, తెగిన అవయవాలు గుండెను కలిచి వేస్తున్నా... ఇదంతా సహజమని, యుద్ధంలో ప్రతి వీరుడు విజయమో, వీరస్వర్గమో ఆశిస్తాడనే అభిప్రాయాలు ఆమె మనసులో మెదిలేవి. అవును... తన సోదరుడు, పుత్రులు కూడా పోరాడి మరణించారని నకులుడు చెప్పాడు. నిద్రమత్తులో లేకపోతే వారు తప్పకుండా అశ్వత్థామను తుదముట్టించే వారే... యుద్ధం ఆరవ రోజు, పన్నెండవ రోజు వారు ప్రదర్శించిన సాహసం గురించి శిబిరంలో తనకు భీముడు చెప్పిన వివరాల్ని తాను ఇప్పటికీ మరిచిపోలేదు. ఆరవ రోజు ధృష్టద్యుమ్నుడు మకర వ్యూహం పన్నినప్పుడు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=620**